
తీజ్ వేడుకల్లో బంజారా మహిళలు, పురుషులు

ఘనంగా తీజ్ వేడుకలు

ఎల్బీనగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం ఎన్టీఆర్‌నగర్‌లోని బంజారబస్తీలో తీజ్ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సంత్‌సేవాలాల్ మహారాజ్‌దండి మేరమ్మ పండుగ మహోత్సవం, శీత్ల పండుగ, తీజ్ వేడుకను పురస్కరించుకుని పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. బంజారా బస్తీలోని సంత్ సేవాలాల్ మహారాజ్ దండి మేరమ్మయాడి ఆలయం నుంచి డీజే సంబరాలతో బయలుదేరిన ఊరేగింపులో బంజారాలు ఆటపాటలతో మహిళలు, పురుషులు బంజార సంప్రదాయ దుస్తులతో పాల్గొన్నారు. ఈ వేడుకలలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపీనాయక్, నాయకులు నేనావత్ హరిశంకర్, రమావత్ శిరినాయక్, దల్యానాయక్, జానకి అంగోత్ నీలాబాయి పాల్గొన్నారు.

ప్రత్యంగిరా పరమేశ్వరికి లక్ష గాజుల పూజ

ఎల్బీనగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా కుర్తాళం పీఠాధిపతులు జగద్గురు సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి ఆశీస్సులతో ఆర్‌కేపురంలోని కుర్తాళపీఠ ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో సోమవారం లక్ష గాజుల పూజ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని దేవతలను రంగురంగుల గాజులతో అలంకరించారు. విశేష అభిషేకం అనంతరం అమ్మవారికి గాజుల పూజసేవ చేశారు. ఈసందర్భంగా ఎన్ఆర్ఐ భక్తులు తరుణ్, గాయత్రి అభినిక దంపతులు అమ్మవారికి బంగారు మంగళసూత్రాలు, పుస్తెల తాడును సమర్పించారు. ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్, విఠల్‌శర్మ, హేమంత్, అరుణ, హేమ, శ్రీపతి, సాయికుమార్, అశ్వంత్ రామశర్మ, కనకవల్లి పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత జన్మోత్సవాలు

చాదర్‌ఘాట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ భవానీనగర్‌లోని సంతోషిమాత ఆలయంలో శ్రావణశుద్ధ రాఖీపౌర్ణమి రోజైన సోమవారం అమ్మవారి జన్మోత్సవ వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం 6గంటలకు ధ్వజారోహణం, 9గంటలకు గోక్షీర సహస్ర శంఖాభిషేకం, మధ్యాహ్నం 12గంటలకు అమ్మవారి డోలారోహణం, మహా మంగళహారతి, మంత్ర పుష్పం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఉదయం నుంచి పోటెత్తారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సరూర్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సిల్వర్ డ్రాప్స్ స్కూల్‌లో 1999లో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం జిల్లెలగూడలోని స్కూల్ ఆవరణలో ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. స్కూల్ కరస్పాండెంట్ జె.శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొనగా వారిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

విజ్ఞాన్‌లో బీటెక్ విద్యార్థుల ఓరియంటేషన్ డే

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరశివారు దేశ్‌ముఖ్‌లోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం బీటెక్ విద్యార్థుల ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి పూనం మాలకొండయ్య, ఏపీ ఎంపీ, విజ్ఞాన్ సంస్థల వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లు కష్టపడి చదువుకోవాలని అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ నాగభూషన్, రిజిస్ట్రార్ కమోడో డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్ స్కూల్స్ వైస్ చైర్మన్ రాణిరుద్రమదేవి, సీఈవో శ్రీకాంత్, డీన్ విజయకృష్ణ, సుబ్బారావు, రుక్మిణి, అనిల్‌కుమార్, సునీల్ సంకాల, సయ్యద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదింటి వివాహానికి పుస్తె, మెట్టెలు అందజేత

వనస్థలిపురం: పేదింటి మహిళల వివాహాలకు సహకారం అందించడానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన కోమటి వరలక్ష్మీ సత్యనారాయణ దంపతుల కుమార్తె రేఖ, సిద్దిపేట జిల్లా తడ్కపల్లికి చెందిన అల్లిమల్లి సుజాతాపరుశరాములు దంపతుల కుమార్తె అనూష వివాహాలకు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సోమవారం నాగోల్‌లోని తన నివాసంలో పుస్తె, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు.

ట్రాన్స్‌జెండర్ హెల్ప్‌డెస్క్ నంబర్ 155326

ఓల్డ్‌మలకపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మలకపేటలోని వికలాంగుల సంక్షేమశాఖలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్ హెల్ప్ డెస్క్‌ను మూసివేశారు దానికి ప్రత్యామ్నాయంగా పీడబ్ల్యూడీ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేశారు. ట్రాన్స్‌జెండర్స్ తమ సమస్యలను 155326 నంబర్‌కు తెలియజేయాలని సంబంధిత అధికారులు సూచించారు.

సెలవుపై వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్

ఓల్డ్ మలకపేట : వికలాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ బీ. శైలజ ఈనెల 26వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఎవరికి బాధ్యతలు ఇచ్చారో తెలియాల్సి ఉందని సంబంధిత అధికారులు తెలిపారు.

హిందువులపై దాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, సంరెడ్డి సురేందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుసగా జరుగుతున్న దాడులకు నిరసనగా భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి, మూసారాంబాగ్ విభాగ్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మూసారాంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి దిల్‌సుఖ్‌నగర్‌లోని మారుతిమందిర్ వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌర దేవేందర్, తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, యాదగిరి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్‌పటేల్, చందు పాల్గొన్నారు. బంగ్లాదేశ్ ఘటనతో ఇప్పటికైనా హిందువులు సమైక్యతతో ముందుకు రావాలని కార్పొరేటర్, జిల్లా అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

'కిలిమంజారో'ను అధిరోహించిన నగర విద్యార్థి

● పిన్నవయస్కుడిగా రికార్డు

హైదరాబాద్ సిటీ: నగరానికి చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రీతం గోలి (16) మౌంట్ కిలిమంజారోను అధిరోహించాడు. నగరం నుంచి ఈ ఫీట్‌ను సాధించిన అతి పిన్నవయస్కునిగా రికార్డులకెక్కాడు. ఎనిమిది రోజుల పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుని మౌంట్ కిలిమంజారోను జూలై 17న అధిరోహించినట్లు ప్రీతం తెలిపారు. ప్రస్తుతం 12వ తరగతి చదువుతున్న అతను సత్యరూప్ సిద్ధాంత్ మార్గదర్శకత్వంలో నలుగురు క్లైంబర్స్‌తో ఈ యాత్ర పూర్తి చేశాడు. కిలిమంజారో పర్వతంపై జాతీయ పతాకంతో పాటుగా ఎన్‌సీసీ ఫ్లాగ్, తన స్కూల్ ఫ్లాగ్స్‌ను ఎగురవేసినట్లు తెలిపాడు. ఈ పర్వతాన్ని అధిరోహించిన తొలి ఎన్‌సీసీ కేడెట్ కూడా తానే అని ఈ సందర్భంగా అతను వెల్లడించాడు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు : ఆటో డ్రైవర్ మృతి

హయత్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొంగలకలాన్‌కు చెందిన గోపగళ్ల జనార్దన్(42) ఆటో డ్రైవర్. సోమవారం కొంగరకలాన్ నుంచి ఆటోలో చికెన్ తీసుకుని కోహెడలోని అర్క రీసార్ట్‌కు వస్తున్నాడు. రీసార్ట్‌కు మరలుతుండగా వెనుకనుంచి వేగంగా వచ్చిన హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. జనార్దన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.


యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘీరెడ్డికి రాఖీ కడుతున్న మంత్రి సీతక్క


రాచకొండ కమిషనరేట్ సైబర్‌క్రైమ్ ఏసీపీ కరుణాకర్‌రావుకు రాఖీ కడుతున్న దుర్గావాహిని మాతృశక్తి కార్యకర్తలు


కేటీఆర్‌కు రాఖీ కడుతున్న మాజీ కార్పొరేటర్ స్వప్నాసుందర్‌రెడ్డి


డీసీసీబీ చైర్మన్ సత్తయ్యకు రాఖీ కడుతున్న ఆయన సోదరి


జువెనైల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బేగ్‌కు రాఖీ కడుతున్న బీజేపీ నేత మాధవీలత

ఆనందోత్సాహాల రక్షాబంధన్

సైదాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సోదరీమణులు, సోదరుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు సోమవారం జోన్ పరిధిలోని సైదాబాద్, మాదన్నపేట, మలకపేట పరిసరాలలో ఘనంగా జరిగాయి. వయస్సు తారతమ్యం లేకుండా అందరూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటింటా రాఖీ పండుగ సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న సోదరీమణులు తమ పుట్టిళ్లకు వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.


భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి నివాసంలో రాఖీ వేడుకల్లో బీజేపీ మహిళా నేతలు

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

ఎల్బీనగర్ : రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమిని ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని ఆర్‌కేపురం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్‌కేపురంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో గాయత్రి హోమం, గాయత్రి ధారణ, సామూహిక రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.

చంపాపేట, హస్తినాపురంలలో..

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో సోమవారం రాఖీపండుగను పురస్కరించుకొని చిన్న పెద్ద తారతమ్యం లేకుండా చిన్నారులు, మహిళలు అన్న తమ్ముళ్లకు రాఖీలను కట్టి స్వీట్లు తినిపించారు. పండుగ సందర్భంగా రాఖీల దుకాణాలు, స్వీట్ షాప్‌లు జనంతో కిటకిటలాడాయి.

మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో..

సరూర్‌నగర్: మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లలోని గ్రామాలు, కాలనీలు, బస్తీల్లో రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించగా, సోదరులు వారికి బహుమతులు అందజేసి ఆత్మీయతను చాటుకున్నారు.


లింగోజిగూడలో సోదరునికి రాఖీ కడుతున్న చిన్నారులు

అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్‌లలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో అక్కచెల్లెళ్లు, అన్నతమ్ములకు రాకీలను కట్టి అన్నచెల్లెల్ల అనుబంధాన్ని చాటారు.

హయత్‌నగర్ : హయత్‌నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో అక్కాచెల్లెళ్లు పుట్టింటికి వచ్చి సోదరులకు రాఖీ కట్టారు. బస్ స్టాప్‌ల వద్ద ప్రయాణికుల రద్దీ కనిపించింది. దాంతో పాటు మిఠాయి, రాఖీ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

వనస్థలిపురం : వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, మన్సూరాబాద్, నాగోల్ డివిజన్‌లో రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ అరుణకు రాఖీ కడుతున్న బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి


వీహెచ్‌పీ ఆధ్వర్యంలో చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఎస్ఐలకు సిబ్బందికి రాఖీ కడుతున్న యువతులు


నాదర్‌గుల్‌లో తమ్ముళ్లకు రాఖీలు కడుతున్న అక్కలు


టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి రాఖీ కడుతున్న ఆయన సోదరీమణులు

మహాలక్ష్మీకాలనీలో వరదనీటి సమస్యకు పరిష్కారం

● హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు

వనస్థలిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇళ్లలోకి వరద.. పైకాలనీ నుంచి వస్తున్న వరదనీరు.. అవస్థలు పడుతున్న మహాలక్ష్మీ కాలనీవాసులు అనే శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. ఇటీవల కురిసిన వర్షానికి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారులోని మహాలక్ష్మీ కాలనీలోకి పై కాలనీల నుంచి వస్తున్న వరదనీరుతో కాలనీ వరదమయంగా మారింది. పై కాలనీల నుంచి వచ్చే వరదనీరు మహాలక్ష్మీకాలనీ నుంచి దిగువ ప్రాంతానికి వెళ్తుంది. ఈ కాలనీకి ఆనుకుని ఉన్న వ్యవసాయ భూమి యజమానులు తమ పొలాల నుంచి వరద నీరు వెళ్లకుండా అడ్డుగా గోడను నిర్మించారు. దీంతో వరదనీరు వెళ్లడానికి ఆస్కారం లేకపోవడంతో ఆ వరదనీరు కాలనీలోని ఇళ్లలోకి చేరుతుండడంతో కాలనీవాసులు మూడు రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్య పరిష్కారానికి స్థానిక కార్పొరేటర్ లచ్చిరెడ్డి సోమవారం ఉదయం జీహెచ్ఎంసీ ఏఈ నరేంద్ర తేజతో కలిసి కాలనీలోని వరదనీటి సమస్య పరిష్కారానికి సదరు వ్యవసాయ భూముల యజమానులతో చర్చలు జరిపి వరదనీరు వెళ్లడానికి అడ్డుగా ఉన్న గోడను మున్సిపల్ సిబ్బందితో తొలగించారు. దీంతో వరద నీరు సాఫీగా దిగువ ప్రాంతానికి వెళ్తుండడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతి దిన పత్రికకు, కార్పొరేటర్ లచ్చిరెడ్డికి కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


మహాలక్ష్మీకాలనీలో వరదనీరు దిగువ ప్రాంతానికి వెళ్లడానికి అడ్డుగా ఉన్న గోడను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆలయంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

చంపాపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో సోమవారం రూ.27లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ధర్మకర్తలతో కలిసి ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఆలయంలోని కేదార్‌నాథ్, వినాయకస్వామి ఆలయం పరిసరాల్లో దాతలు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అనురాధ దంపతుల సహకారంతో రూ.1.20లక్షలతో టీన్‌షెడ్ నిర్మాణం, ప్రధాన ఆలయం ముందు రూ.10లక్షలతో శ్రీసాయి బాలాజీ గ్రూప్ అధినేత, ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, సుమిత దంపతుల సహకారంతో రఫ్ గ్రానైట్ ఫ్లోరింగ్ బండలు, కోనేరు ముందు దాతలు ఎడవల్లి బాల్‌రాజ్, శ్రీనివాస్, విజయ్ కుమార్ సహకారంతో ఆరు లక్షలతో షెడ్ నిర్మాణం, దాతలు జాల యాదగిరిరెడ్డి సహకారంతో రెండు లక్షలతో రథశాలకు షెడ్ నిర్మాణం, దాతలు పోతుల శిరీషా రాజశేఖర్‌రెడ్డి సహకారంతో రెండు లక్షలతో వంటశాల ఆధునికరణ, దాతలు, ఆలయ ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌కుమార్ గౌడ్, మేకల యాదగిరి సహకారంతో జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఆరు లక్షలతో సిరామిక్ టైల్స్, దాతలు బొక్కా రాంరెడ్డి, అరుణ సహకారంతో రూ.75వేలతో పాదరక్షల స్టాండ్‌ను ఆలయ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం దాతలు సహకరించాలని కోరారు. అనంతరం దాతలను ఆలయ పండితులు, అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు అంజిరెడ్డి, బబ్బూరి ఆనంద్ కుమార్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, మధుసాగర్, చేగోని సురేష్‌గౌడ్, బీసుకుం ట్ల సతీష్‌గౌడ్, చీర తిరుమలేష్, మేకల యాదగిరి, ముద్ద కళ్యాణ్, గూడూరు మధుసూదన్‌రెడ్డి, సాంబరాజు శైలజ, దాతలు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


దాతలు, ధర్మకర్తలతో కలిసి రథశాల షెడ్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి

హంతకులను కఠినంగా శిక్షించాలి

● కార్పొరేటర్ పవన్‌కుమార్, రాష్ట్ర మహిళామోర్చా కార్యదర్శి గీతారెడ్డి

కొత్తపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జూనియర్ డాక్టర్ హంతకులను కఠినంగా శిక్షించాలని సోమవారం రక్షాబంధన్ వేళ ఆమె చిత్రపటానికి కార్పొరేటర్ పవన్‌కుమార్ రాఖీ కట్టారు. పశ్చిమబెంగాల్‌లో చోటు చేసుకున్న జూనియర్ డాక్టర్ అత్యాచార అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, ఆందోళన వ్యక్తం చేస్తూ రాష్ట్ర మహిళామోర్చా కార్యదర్శి గీతారెడ్డి ఆధ్వర్యంలో మోహన్‌నగర్‌చౌరస్తాలో కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళలందరికీ రక్షణ కల్పిస్తూ భరోసానివ్వాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గీతారెడ్డి మాట్లాడుతూ మహిళల సంరక్షణకు అందరూ నడుం బిగించాలని, ఇలాంటి ఘటనల నిందితులపై ప్రభుత్వాలు అత్యంత కఠినంగా వ్యవహరించాలని కోరారు. అత్యాచార ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి అంటూ నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా కోశాధికారి విజయ, స్థానిక నాయకులు సుందర్‌నారాయణ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


ఆర్ఎన్ఆర్ కాలనీలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అత్యాచార ఘటనపై సీపీఐ నిరసన

అబ్దుల్లాపూర్‌మెట్ : జూనియర్ డాక్టర్ పై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ సోమవారం సీపీఐ అనుబంధ ప్రజా సంఘాలతో ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-3లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ మాట్లాడుతూ అత్యాచార నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హరిసింగ్ నాయక్, ప్రసాద్, మధు, భూక్య వినోద్, నవనీత, పుల్లయ్య, సైదులు యాదగిరి, దేవమ్మ, అనుసూయ, నాయరాజు, కవిత పాల్గొన్నారు.

ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి

● తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్

వనస్థలిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న డీఈఓ షేక్ వసీంఖాన్‌కు మూడు నెలలుగా జీతం రాకపోవంతో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి నూకం భిక్షపతిలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం షేక్ వసీంఖాన్ మృతికి సంతాపంగా వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఏజెన్సీ వ్యవస్థను తక్షణమే రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా తమకు జీతాలు చెల్లించేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు తమ అకౌంట్‌లో నేరుగా జమ చేయించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ నాగప్రీతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో నిరసన కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు


అడిషనల్ కలెక్టర్‌కు అవిశ్వాసం లేఖను అందజేస్తున్న కౌన్సిలర్లు

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

● 17మంది సభ్యుల సంతకాలతో కలెక్టర్‌కు లేఖ అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం 17మంది సభ్యుల సంతకాలతో కూడిన పత్రాన్ని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు అందజేశారు. అయితే పాలకవర్గం పదవి కాలం మరో నాలుగు నెలలు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి చైర్‌పర్సన్‌గా ఎన్నికైన స్వప్న అసెంబ్లీ ఎన్నికల ముందు మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 13మంది కౌన్సిలర్లతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు కౌన్సిలర్లతో కలిసి మొత్తం 17మంది కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించారు. దీనిపై కలెక్టర్.. కౌన్సిలర్లకు నోటీసులను అందించిన అనంతరం అవిశ్వాస బలపరీక్ష కోసం తేదీని ప్రకటించనున్నారు. కాంగ్రెస్‌కి చెందిన చైర్మన్‌పై అదే పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించడం ఆసక్తి రేపుతోంది.


జాతీయ రహదారిపై బైఠాయించిన న్యాయవాదులు

న్యాయవాదులపై దాడులను నిరసిస్తూ ఆందోళన

● జాతీయ రహదారిపై బైఠాయించిన న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై పోలీసుల దాడిని నిరసిస్తూ ఎల్బీనగర్‌లో రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. సోమవారం విధులు బహిష్కరించిన న్యాయవాదులు రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో బైఠాయించి నినాదాలు చేశారు. కోర్టులో ఉన్న పోలీసులను బయటకు పంపించి వేశారు. అనంతరం విజయవాడ జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ చేపట్టారు. ఒక దశలో జాతీయ రహదారిపై బైఠాయించి న్యాయవాదులపై వరుస దాడులపై ఆందోళన చేపట్టారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న వరుస దాడులను ఖండించారు. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు సంతోష్‌పై దాడి చేసిన బోరబండ పోలీసులపై కఠిన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసుల దాడులకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళనలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని న్యాయం కోసం పోరాడే న్యాయవాదులపై దాడి చేయడమంటే చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, సీనియర్ న్యాయవాది శ్రీనాథ్, పీతం ప్రదీప్, మీనాక్షి, జ్యోతి, నర్సింహ, రవికుమార్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కారులో మంటలు.. తప్పిన ప్రమాదం

చంపాపేట్: కారు మొరాయించడంతో దాన్ని మరమ్మతులు చేస్తుండగా అకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగిన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరగూడకు చెందిన మెకానిక్ అడిపు రాజు తన భార్యతో కలిసి టాటా ఇండికా కారులో హయత్‌నగర్ నుంచి పిసల్‌బండ మీదుగా ఉప్పుగూడకు వెళ్తున్నారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిసల్‌బండ ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ప్రధాన రహదారిపై కారు మొరాయించడంతో దాన్ని పక్కకు నిలిపారు. ఇంజన్ నుంచి పొగలు వస్తున్నాయని చూసే సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఇంజన్ కాలిపోయింది. దీంతో స్థానిక ప్రజలు భయాభ్రాంతులకు గురైనారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారును పక్కకు తొలగించారు. కాగా ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

బీరువా మీద పడి కూలీ మృతి

హయత్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బీరువా మీద పడి కూలీ మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాముల బీబీఆర్ కాలనీలో నివాసం ఉండే దొందుగుల ఎల్లస్వామి(51) పసుమాములలోని సాయిరెడ్డికాలనీలో కొత్త ఇంటి బండల మీద పడిన కలర్‌ను తూడ్చడానికి కూలీకి వెళ్లాడు. బండలు తూడ్చుతుండగా ప్రమాద వశాత్తు అల్మారా(బీరువా) ఎల్లస్వామిపై పడింది. దీంతో తీవ్ర గాయాలకు గురైన ఎల్లస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.